




## మంచిర్యాల జిల్లాలో నామినేటెడ్ పోస్టులపై ఉత్కంఠ !!!

- మంచిర్యాల జిల్లా గ్రంథాలయ చైర్మన్, విశ్వనాథ ఆలయ చైర్మన్ పదవుల కోసం ఆశావాహుల ఎదురు చూపులు
- గ్రంథాలయ చైర్మన్ భర్తీ లో జాప్యానికి రాజకీయ చక్రం లోనా......?

02

# కో ఆప్షన్ పదవులు వరించేదెవరినో?



03

**పదవులపై పలువురు నాయకులు ఆశలు**
**త్వరలో నోటిఫికేషన్ విడుదలకు ఛాన్స్**
**ఒక్కో మునిసిపాలిటీలో నలుగురికి అవకాశం**
**ఎమ్మెల్యేల చుట్టూ ఆశావహుల ప్రదక్షిణలు**

మునిసిపల్ ఎన్నికల ప్రక్రియ ముగియడంతో అందరి దృష్టి కో ఆప్షన్ సభ్యుల వైపు మళ్లింది. వార్డు సభ్యులు, చైర్మన్లు, వైస్ చైర్మన్ల ఎన్నిక కూడా పూర్తయినందున ఇంతకాలం పదవులపై ఆశలు పెట్టుకున్న ద్వితీయ శ్రేణి నాయకులు ఆదిశగా ప్రయత్నాలు ప్రారంభించారు. త్వరలో కో ఆప్షన్ పదవులకు నోటిఫికేషన్ జారీ చేసేందుకు యంత్రాంగం కూడా పూర్తిస్థాయిలో సన్నద్ధం అవుతోంది. మంచిర్యాల జిల్లాలో మంచిర్యాల కార్పొరేషన్‌తోపాటు ఎన్నికలు జరిగిన చెన్నూరు, క్యాతన్‌పల్లి, బెల్లంపల్లి, లక్షెట్టిపేట మునిసిపాలిటీల్లో కో ఆప్షన్ పదవులు భర్తీ చేయాల్సి ఉంది. కాగా క్యాతన్‌పల్లి మునిసిపాలిటీలో చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక ప్రక్రియ వాయిదా పడినందున కో ఆప్షన్ పదవుల భర్తీ చేస్తారా...? లేదా....? చర్చ నడుస్తోంది.

కో ఆప్షన్ పదవులు త్వరలో భర్తీ కానున్న నేపథ్యంలో ఎంతమందికి అవకాశం కల్పిస్తారోనన్న చర్చ సాగుతోంది. సాధారణంగా ఒక్కో మునిసిపాలిటీ పరిధిలో నలుగురికి కో ఆప్షన్ సభ్యులుగా అవకాశం కల్పిస్తారు. అలాగే కార్పొరేషన్ పరిధిలో కనీసం నలుగురు నుంచి ఏడుగురు సభ్యులకు అవకాశం కల్పించే వెసులుబాటు ఉన్నది. ఈ లెక్కన మంచిర్యాల కార్పొరేషన్‌తో పాటు జిల్లాలోని నాలుగు మునిసిపాలిటీల పరిధిలో మొత్తం 20 పైచిలుకు కో ఆప్షన్ పదవులు భర్తీ అయ్యే అవకాశాలు ఉన్నాయి. నిబంధనల ప్రకారం ఒక్కో మునిసిపాలిటీలో ఇద్దరు కో ఆప్షన్ సభ్యులను మాత్రమే తీసుకోవలసి ఉంటుంది. అయితే మునిసిపాలిటీ గ్రేడ్‌ను బట్టి సభ్యుల సంఖ్యను పెంచుకునేందుకు అవకాశం ఉంది. అలాగే కార్పొరేషన్ పరిధిలో నలుగురిని మాత్రమే ఎంపిక చేయాల్సి ఉండగా, అదనంగా మరో ముగ్గురికి కూడా అవకాశం కల్పించే వెసులుబాటు ఉంటుంది.




## చెట్ల కిందే హెచ్ పీ గ్యాస్ పంపిణీ వినియోగదారులకు తప్పని తిప్పలు

- చీటికిమాటికి అడ్డాలు మారడంతో అవస్థలు
- హెచ్ పి గ్యాస్ డ్వాక్రా మహిళల ఆవేదన

06




## ప్రభుత్వ భూములపై కబ్జా కోరలు.. తిర్యాణిలో యథేచ్ఛగా సాగుతున్న ఆక్రమణలు!

అధికారుల మౌనంపై వెల్లువెత్తుతున్న విమర్శలు.
రాజకీయ అండదండలతోనే కబ్జాలని ఆరోపణలు

**తిర్యాణి, ఫిబ్రవరి 22 (ప్రజా జ్యోతి):** మండల పరిధిలో ప్రభుత్వ భూములకు రక్షణ కరువైంది. పర్యవేక్షించాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండటంతో భూబకాసురులు పెట్రాగిపోతున్నారు . గ్రామాల్లోని పంచాయతీ, రెవెన్యూ శాఖలకు చెందిన ఖాళీ స్థలాలు క్రమంగా కొందరి చేతుల్లోకి వెళ్లి వ్యక్తిగత ఆస్తులుగా మారుతున్నాయి. ప్రజా ప్రయోజనాల కోసం కేటాయించిన ఈ భూముల్లో షెడ్లు, దుకాణాలు, ఇండ్లు, వెలుస్తున్నాయని, మరికొన్ని చోట్ల కంచెలు వేసి కబ్జా చేస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల కళ్లముందే అక్రమ కబ్జాలు యథేచ్ఛగా సాగుతున్నా, బాధ్యులపై చర్యలు తీసుకోవడంలో యంత్రాంగం తాత్సారం చేయడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పలుమార్లు బాధితులు, గ్రామస్థులు ఫిర్యాదులు చేసినా క్షేత్రస్థాయిలో ఎలాంటి స్పందన లేకపోవడంతో ప్రజల్లో ఆగ్రహం కట్టలు తెంచుకుంటోంది. ఈ ఆక్రమణల వెనుక రాజకీయ అండదండలు పుష్కలంగా ఉన్నాయనే అనుమానాలు బలంగా వినిపిస్తున్నాయి. ప్రభుత్వ ఆస్తి అంటే ప్రజలందరి సొత్తు అని, దాన్ని కాపాడాల్సిన బాధ్యత కలిగిన అధికారులే మౌనం వహించడం వెనుక మతలబు ఏమిటని గ్రామ పెద్దలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తక్షణమే సమగ్ర సర్వే నిర్వహించాలని, ఆక్రమణలపై స్పష్టమైన నివేదిక విడుదల చేసి బాధ్యులపై కఠినంగా శిక్షించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. నిర్లక్ష్యం వహించిన అధికారులపై కూడా చర్యలు తీసుకుని, కబ్జాకు గురైన భూములను తిరిగి ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవాలని, ప్రభుత్వ ఆస్తులను రక్షించడంలో చిత్తశుద్ధి చాటాలని ప్రజలు కోరుతున్నారు.



# మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్‌లో పదవీ బాధ్యతల స్వీకారం

- ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు ఆశీర్వాదాలతో ఉత్కంఠ వాతావరణం

**మంచిర్యాల, 22, ఫిబ్రవరి ( ప్రజా జ్యోతి ):** నూతనంగా ఏర్పాటైన మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్లో ఆదివారం నిర్వహించిన మేయర్, డిప్యూటీ మేయర్‌ల ప్రమాణ స్వీకార కార్యక్రమం ఆనందభాష్పాల మధ్య ఉత్కంఠ వాతావరణంలో జరిగింది . ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు మేయర్, డిప్యూటీ మేయర్‌లను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. వేదమంత్రాల మధ్య తమకు కేటాయించిన కార్యాలయాల్లో, ఎమ్మెల్యే సమక్షంలో నూతన మేయర్, డిప్యూటీ మేయర్‌లు అధికారికంగా పదవీ బాధ్యతలను స్వీకరించారు. బాధ్యతల స్వీకరణ అనంతరం మేయర్ ధర్ని మధుకర్, డిప్యూటీ మేయర్ సల్ల రమ్య– మహేష్ దంపతులను ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు ప్రత్యేకంగా ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మంచిర్యాల నగరాభివృద్ధిని ప్రధాన లక్ష్యంగా తీసుకొని ప్రజల సమస్యల పరిష్కారానికి నిబద్ధతతో పనిచేయాలని సూచించారు. మంచి పాలనతో నగరానికి మంచి పేరు తీసుకురావాలని హితవు పలికారు. అనంతరం మేయర్, డిప్యూటీ మేయర్ దంపతులు కూడా



ఎమ్మెల్యే ఆశీర్వాదాలు తీసుకొని, తమకు ఈ అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలతో ధన్యవాదాలు తెలిపారు. ఆనందభాష్పాలతో సాగిన ఈ సన్నివేశం అక్కడికి వచ్చిన వారందరినీ ఆకట్టుకుంది. గురుశిష్యుల మాదిరిగా ఈ దృశ్యాన్ని అందరూ చర్చించుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ జి. అన్వేష్ పాల్గొని ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావుకు స్వాగతం పలికారు. మున్సిపల్ అధికారులు, సిబ్బంది, కార్పొరేటర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# మంచిర్యాల జిల్లాలో నామినేటెడ్ పోస్టులపై ఉత్కంఠ !!!

**మంచిర్యాల, 22, ఫిబ్రవరి ( ప్రజా జ్యోతి ):** రాష్ట్ర పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఉగాదిలోపే నామినేటెడ్ పోస్టులను భర్తీ చేస్తామని ప్రకటించడంతో కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లో ఉత్కంఠ కంటే ఉత్సాహమే ఎక్కువగా కనిపిస్తోంది. ఈ ప్రకటన అనంతరం నామినేటెడ్ పదవులను ఆశిస్తున్న ఆశావాహ నేతలు స్థానిక ఎమ్మెల్యేలు, మంత్రుల చుట్టూ తిరుగుతూ తమ ప్రయత్నాలను వేగవంతం చేసినట్టు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. ఈ నేపథ్యంతో మంచిర్యాల జిల్లాలోని జిల్లా కేంద్రంలో ఉన్న గ్రంథాలయ చైర్మన్ పదవి ప్రధానంగా చర్చకు వచ్చింది. ఈ పదవిని ఆశిస్తున్న కాంగ్రెస్ ఆశావాహుల సంఖ్య భారీగానే ఉండటంతో పాటు, కొన్ని రాజకీయ అంశాలు వారికి ఆటంకంగా మారుతున్నాయని విశ్లేషకులు చెబుతున్నారు. మంచిర్యాల జిల్లాలో ప్రస్తుతం ముగ్గురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఉన్నారు. గడ్డం వినోద్ బెల్లంపల్లి ఎమ్మెల్యే గా , గడ్డం వివేక్ చెన్నూరు ఎమ్మెల్యేగా అలాగే రాష్ట్ర మంత్రి గా, కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు మంచిర్యాల ఎమ్మెల్యేగా ఉన్నారు .జిల్లా గ్రంథాలయము మంచిర్యాల నియోజక వర్గం మంచిర్యాల పట్టణ నడిబొడ్డున ఉండటంతో, ఈ పదవికి ముగ్గురు ఎమ్మెల్యేలు ఒకే అభిప్రాయంతో ముందుకు వస్తేనే భర్తీ అవుతుందన్న అభిప్రాయం బలంగా వినిపిస్తోంది. అయితే బెల్లంపల్లి, చెన్నూరు ఎమ్మెల్యేలు సొంత అన్నదమ్ములు కాగా, మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు (పీఎస్ఆర్) తో వారి మధ్య రాజకీయంగా గ్యాప్ ఉందన్న ప్రచారం కొనసాగుతోంది. తనకు మంత్రి పదవి రాకపోవడంపై అసంతృప్తిని పీఎస్ఆర్ పలు సందర్భాల్లో బహిరంగంగా వ్యక్తం చేసిన నేపథ్యంలో



ఈ విభేదాలు మరింత స్పష్టమయ్యాయని పార్టీ వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో జిల్లా గ్రంథాలయ చైర్మన్ పదవిని ఆశిస్తున్న కార్యకర్తలు, నాయకు లకు ఇది సవాలుగా మారిందని చెప్పాలి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి దాదాపు రెండున్నరేళ్లు గడిచినా, ఈ నామినేటెడ్ పదవి ఇప్పటివరకు భర్తీ కాకపోవడం విశేషం. ఈ విషయంలో మంచిర్యాల ఎమ్మెల్యే పీఎస్ఆర్ వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారన్న సమాచారం కూడా చర్చనీయాంశంగా మారింది.

**భర్తీ కాని మంచిర్యాల పట్టణ విశ్వనాథ ఆలయ చైర్మన్ పదవి**

అదే విధంగా మంచిర్యాల పట్టణం లోని ప్రముఖ విశ్వనాథ ఆలయం చైర్మన్ పదవిని కూడా భర్తీ చేయాల్సి ఉంది. ఈ ఆలయం పూర్తిగా మంచిర్యాల ఎమ్మెల్యే పరిధిలో ఉండటంతో, ఆయన నిర్ణయమే తుది నిర్ణయంగా మారే అవకాశాలున్నాయి. అందువల్ల ఈ పదవి భర్తీ సులువుగానే జరిగే సూచనలు కనిపిస్తున్నాయి. మొత్తంగా చూస్తే, మంచిర్యాల జిల్లాలోని గ్రంథాలయ చైర్మన్, విశ్వనాథ ఆలయ చైర్మన్ వంటి కీలక నామినేటెడ్ పోస్టులు ఎప్పటికైనా భర్తీ కావాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయం పరిశీలకుల్లో వ్యక్తమవుతోంది. అయితే జిల్లాలోని ముగ్గురు ఎమ్మెల్యేలు తమ పదవీ కాలంలో ఈ అంశాన్ని పరిష్కరిస్తారా ? లేక రాజకీయ చక్రంలోనే ఈ గ్రంథాలయ చైర్మన్ పదవి ఇరుక్కుంటుందా? అన్నది కాలమే తేల్చాల్సి ఉంది.





# లక్ష్యాల సాధన కోసం అన్ని ఏరియాలు మరింత వేగంగా పనిచేయాలని

- సింగరేణి సీఎండీ డా. బుద్ధప్రకాశ్ జ్యోతి
- సింగరేణి లక్ష్యాల సాధనకు ఏరియా జీఎంలతో ప్రత్యేక సమీక్ష

**మంచిర్యాల, 22, ఫిబ్రవరి ( ప్రజా జ్యోతి ):** లక్ష్యాల సాధన కోసం అన్ని ఏరియాలు మరింత వేగంగా పనిచేయాలని సింగరేణి సీఎండీ డా. బుద్ధప్రకాశ్ జ్యోతి సూచించారు .సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (ఎస్‌సిసిఎల్) సీఎండీ డా. బుద్ధప్రకాశ్ జ్యోతి, సింగరేణి భవన్ నుండి అన్ని ఏరియా జనరల్ మేనేజర్లతో ప్రత్యేక సమీక్ష సమావేశంను నిర్వహించారు. ఈ సమావేశంలో బొగ్గు డిస్పాచీలు, ఓవరబర్డెన్ రిమోవల్, ఉత్పత్తి లక్ష్యాలు అంశాలపై విస్తృతంగా చర్చించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి మిగిలిన 38 రోజుల్లో లక్ష్యాల సాధనలో ఎదురవుతున్న స్థానిక సమస్యలు, పరిమితులను సీఎండీ సమీక్షించారు. లక్ష్యాల సాధన కోసం అన్ని ఏరియాలు మరింత వేగంగా పనిచేయాలని, ముఖ్యంగా కమిటెడ్ ఓ.బి రిమోవల్ అలాగే కోల్ డిస్పాచ్ లక్ష్యాలను తప్పకుండా చేరుకోవాలని ఆదేశించారు. థర్మల్ పవర్ స్టేషన్లకు బొగ్గు సరఫరా నిరంతరంగా ఉండేలా అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో డైరెక్టర్లు ఎల్.వి. సూర్యనారాయణ, కె. వెంకటేశ్వర్లు, గౌతమ్ పోట్రు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (కోల్ మూవ్‌మెంట్) బి. వెంకన్న, జీఎం (సీడీఎన్ & మార్కెటింగ్) టి. శ్రీనివాస్ పాల్గొన్నారు. ఏరియా, కార్పొరేట్‌ల జనరల్ మేనేజర్లు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరయ్యారు.

## ఆసిఫాబాద్ 1వ వార్డు అభివృద్ధి: కట్టుబడిన మున్సిపాలిటీ

**ఆసిఫాబాద్ చైర్మన్ ఆకాష్, కౌన్సిలర్ వినోద్ స్థానిక సమస్యలపై సమీక్ష**

**ఆసిఫాబాద్ టౌన్ ఫిబ్రవరి 22 ప్రజా జ్యోతి:** ఆసిఫాబాద్ మున్సిపల్ పరిధిలోని జానక్కపూర్ లో ఆదివారం, 1వ వార్డులో మున్సిపల్ కౌన్సిలర్ వినోద్ మరియు మున్సిపల్ చైర్మన్ ఆకాష్ కలిసి, స్థానిక సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా, కౌన్సిలర్ వినోద్ తన వార్డులో నెలకొన్న మౌలిక వసతుల కొరత, డ్రైనేజీ సమస్యలు, దెబ్బతిన్న రహదారులు మరియు తాగునీటి సరఫరాలో ఉన్న అంతరాయాల గురించి సమగ్రంగా వివరించారు. ప్రధానంగా, వర్షాకాలంలో డ్రైనేజీ వ్యవస్థ వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. ఈ సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని చైర్మన్ ఆకాష్ హామీ ఇచ్చారు. "ప్రజలకు అసౌకర్యం కలగకుండా సంబంధిత అధికారులతో సమన్వయం చేసి అవసరమైన పనులు వెంటనే ప్రారంభిస్తాం," అని ఆయన పేర్కొన్నారు. మున్సిపాలిటీ వారు వార్డు అభివృద్ధికి కట్టుబడినట్లుగా తెలిపారు. "ప్రాధాన్యతా క్రమంలో సమస్యలను పరిష్కరిస్తాం. ప్రజలు కూడా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కారానికి సహకరించాలని కోరుకుంటున్నాం," అని ఆకాష్ తెలిపారు. ఈ పర్యటనలో స్థానికులు, అధికారులు మరియు ప్రజలు కలిసి సమస్యల పరిష్కారం కోసం చర్చలు జరిపారు



# మేయర్ , కార్పొరేటర్ లకు విశ్వబ్రాహ్మణ సంఘం నాయకుల సన్మానాలు



**మంచిర్యాల, 22, ఫిబ్రవరి ( ప్రజా జ్యోతి ):** మంచిర్యాల మేయర్ దర్ని మధుకర్, 33డివిజన్ కార్పొరేటర్ అంబటి కుమారస్వామిలను, 28డివిజన్ కార్పొరేటర్ అమృత రాజ్ కుమార్, 27 డివిజన్ కార్పొరేటర్ కొంద్ర రాజేశ్వరి లింగయ్య లను ఆదివారం మంచిర్యాల జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం తరపున నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో ఘనంగా సన్మానించారు, శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ రాష్ట్ర ప్రధానకార్యర్శి నౌండ్ల సంతోష్ చారి,వేదాస్ జిల్లా అధ్యక్షులు మియపురం వీరచారి, స్వర్ణకార సంఘం జిల్లా సహ కార్యదర్శి శ్రీరామోజు సంతోష్ చారి,కొత్తూరి రాజయ్య, రాష్ట్ర కార్పెంటర్ సంఘం నాయకులు, కార్పెంటర్ సంఘ అధ్యక్షులు జగదీష్ చారి, నస్పూర్ మండల అధ్యక్షులు సిరికొండ సురేందర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కార్పెంటర్ సంఘం,తాటికొండ రాజేశం, ,మండల ప్రధాన కార్యదర్శి రాజాచారి పాల్గొన్నారు.

# కో ఆప్షన్ పదవులు వరించేదెవరినో..

మునిసిపాలిటీల్లో కో ఆప్షన్ సభ్యుల ఎంపికలో పలు నిబంధనలను పాటించ వలసి ఉంటుంది. ఒక్కో మునిసిపాలిటీ పరిధిలో నలుగురు సభ్యులను నియమించిన పక్షంలో.....వారిలో పరిపాలన అనుభవం కలిగిన వారికి రెండు పోస్టులు కేటాయిస్తుండగా, అందులో ఒకటి మహిళకు రిజర్వు అయ్యే అవకాశాలు ఉన్నాయి. కో ఆప్షన్ పోస్టుకు దరఖాస్తు చేసేందుకు మున్సిపల్ కౌన్సిల్ ఓటరు జాబితాలో రిజిష్టర్ అయి ఉండటంతోపాటు 21 సంవత్సరాలకు తగ్గకుండా వయస్సు కలిగి ఉండాలి. మున్సిపల్ కౌన్సిల్‌లో చైర్మన్ మొదలుకొని వార్డు సభ్యుని వరకు ఎందులోనైనా ఐదు సంవత్సరాలకు తగ్గకుండా పాలన సాగించి ఉండాలి. అలాగే అల్ప సంఖ్యాక వర్గానికి చెందిన వారికి మరో రెండు పోస్టులు కేటాయిస్తారు. అందులో కూడా ఒక పోస్టును మహిళకు రిజర్వు చేసే ఛాన్స్ ఉంది. ఈ పదవులకు దరఖాస్తులు చేసే అభ్యర్థులు ఓటర్ జాబితాలో రిజిష్టర్ అయి ఉండటంతోపాటు 21 సంవత్సరముల పైబడి వయస్సు ఉండాలి. ఆశావహులు అల్ప సంఖ్యాక వర్గాలకు చెందిన వారై ఉండాలి. అన్ని అర్హతలు కలిగి ఉన్న అభ్యర్థులు దరఖాస్తు ఫారాలతోపాటు రుజువు పత్రాలతో నిర్ణీత తేదీలోపు కమిషనర్ కార్యాలయంలో అందజేయాల్సి ఉంటుంది. ముస్లిం మైనారిటీ, క్రిష్టియన్ మైనారిటీ వర్గానికి చెందిన వారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో కీలకపాత్ర పోషిస్తున్న మహిళలు, పురపాలనలో అనుభవం, నైపుణ్యం కలిగిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ లేదా పట్టణ ప్రణాళికా విభాగంలో పనిచేసి గెజిటెడ్ అధికారి హోదాలో రిటైర్ అయిన ఉద్యోగులు, అలాగే ఐదేళ్లకన్నా తక్కువ కాకుండా చైర్మన్, వైస్ చైర్మన్, వార్డు సభ్యుడిగా పని చేసిన మాజీ ప్రజాప్రతినిధులు కో ఆప్షన్ సభ్యుల పదవికి దరఖాస్తు చేసుకునేందుకు అర్హులు. మునిసిపాలిటీల్లో విలీనమైన గ్రామాల్లోని సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులుగా అయిదేళ్ళు పని చేసిన ప్రజాప్రతినిధులు అర్హులు. కోఆప్షన్ సభ్యులుగా ఎన్నికయ్యే వారికి కౌన్సిలర్లతో సమానంగా హోదా, అధికారాలు ఉంటాయి. గౌరవ వేతనం కూడా లభిస్తుంది. మునిసిపల్ సమావేశాలకు హాజరయ్యేందుకు వీరికి అవకాశం ఉంటుంది.

# ఛత్రపతి శివాజీ విగ్రహ ప్రతిష్టాపనకు రేండ్లగూడ నూతన కమిటీ ఎన్నిక.

**జన్నారం,ఫిబ్రవరి22(ప్రజాజ్యోతి):** జన్నారం మండలంలోని రేండ్లగూడ గ్రామంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహ ప్రతిష్టాపన కోసం హిందూ వాహిని, శివాజీ కమిటీ సభ్యులు దండవేణి శ్రీధర్ ఓడిపేల్లి రాజేష్ ల ఆధ్వర్యంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. విగ్రహ కమిటీ అధ్యక్షునిగా మోటపలుకుల రమేష్, గౌరవ అధ్యక్షులుగా ఏనుగు సుభాష్ రెడ్డి, అల్లం నరేష్, చెటుపల్లి సత్యం, నెమలికొండ ఆశారాజ్, ప్రధాన కార్యదర్శిగా కస్తులాపురి నరేష్, ఉపాధ్యక్షులుగా మహమ్మద్ ఆసిఫ్, మాసం రవి కిరణ్, కోశాధికారిగా మెంగని మహేష్, సభాధ్యక్షులుగా అల్లం రవి, అల్లం వెంకటరాజం లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ



మాట్లాడుతూ రేండ్లగూడ గ్రామంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహ ఏర్పాటుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. యువతలో దేశభక్తి భావాలను పెంపొందించడం కోసం కృషి చేస్తామని అన్నారు.



# మంచిర్యాల మేయర్ , డిప్యూటీ మేయర్ లకు సిపిఐ సన్మానం

**మంచిర్యాల, 22, ఫిబ్రవరి ( ప్రజా జ్యోతి ):** మంచిర్యాల మేయర్‌గా ధర్ని మధుకర్, డిప్యూటీ మేయర్ గా పదవి బాధ్యతలు చేపట్టిన, చల్ల రమ్య-మహేష్‌లను సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. పదవి బాధ్యతల స్వీకారం తర్వాత వారి చంబర్‌లలో కలిసి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు రేగుంట చంద్రశేఖర్, జిల్లా కార్యవర్గ సభ్యులు, లింగం రవి, జిల్లా సమితి సభ్యులు, ఎస్.కె బాజీ సైదా, పూజారి రామన్న, కొనిగంటి నర్సింగరావు పాల్గొన్నారు.

# టీఎన్జీవో కేంద్ర సంఘం అధ్యక్షులు మారం జగదీశ్వర్ -రమ దంపతులకు వార్షికోత్సవ సన్మానం

**మంచిర్యాల, 22, ఫిబ్రవరి ( ప్రజా జ్యోతి ):** టీఎన్జీవో కేంద్ర సంఘం అధ్యక్షులు మారం జగదీశ్వర్ -రమ దంపతులకు వివాహ వార్షికోత్సవ సందర్భంగా టీఎన్జీవో మంచిర్యాల జిల్లా ఆదివారం శుభాకాంక్షలు తెలిపారు. మంచిర్యాల టీఎన్జీవో జిల్లా నాయకులు టీఎన్జీవో కేంద్ర సంఘం అధ్యక్షులు మారం జగదీశ్వర్ రమ గారి పుణ్య దంపతుల వివాహ వార్షికోత్సవమును పురస్కరించుకొని టీఎన్జీవో మంచిర్యాల జిల్లా అధ్యక్షులు గడియారం శ్రీహరి ఆధ్వర్యంలో శుభాకాంక్షలు తెలియజేసి నిండు నూరేళ్ళు సుఖ సంతోషాలతో ఉండాలని ఘనంగా సన్మానం చేశారు. ఈ సన్మాన కార్యక్రమంలో టీఎన్జీవో మంచిర్యాల జిల్లా మాజీ అధ్యక్షులు కందుకూరి సురేష్ బాబు టీఎన్జీవో మంచిర్యాల జిల్లా కార్యదర్శి భూముల రామ్మోహన్ కేంద్ర సంఘం కార్యదర్శి పొన్న మల్లయ్య అసోసియేట్ అధ్యక్షులు శ్రీపతి బాపురావు మేనేని సందీప్ తదితరులు పాల్గొన్నారు..

# శిక్షణా తరగతులను సర్పంచులు సద్వినియోగం చేసుకోవాలి.

**సర్పంచుల ఫోరం అధ్యక్షులు పేరం శ్రీనివాస్**



**జన్నారం,ఫి బ్రవరి22(ప్ర జాజ్యోతి):** మంచిర్యాల జిల్లా ముల్కల్లలోని ఐజా ఇంజినీరింగ్ కళాశాలలో నేటి నుండి ఈ నెల 27వ తేదీ వరకు సర్పంచులకు నిర్వహించే ప్రత్యేక శిక్షణా తరగతులకు మండల సర్పంచులు హాజరై సద్వినియోగం చేసుకోవాలని జన్నారం మండల సర్పంచుల ఫోరం మండల అధ్యక్షులు పేరం శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జన్నారం మండల పరిధిలోని అన్ని గ్రామాల సర్పంచులు ఈ శిక్షణ కార్యక్రమానికి ఎటువంటి జాప్యం లేకుండా సకాలంలో హాజరు కావాలని కోరారు. గ్రామ అభివృద్ధి,పంచాయతీ రాజ్ చట్టాలు, పాలనపరమైన అంశాలపై అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం ఈ శిక్షణను ఏర్పాటు చేసిందని,కావున సర్పంచులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

# సామాజిక సేవ నుంచి రాజకీయ రంగ ప్రవేశం రాథోడ్ రమేష్ లక్ష్యం

**యువత మద్దతుతో ఎంపిటిసి పోటీలో రమేష్ ముందుకు**

**పరందోలి ఎంపిటిసి బరిలో యువ నాయకుడు రాథోడ్ రమేష్**



**కెరమెరి ఫిబ్రవరి 22 ప్రజా జ్యోతి :** రాథోడ్ రమేష్ కెరమెరి మండలం పరందోలి ఎంపిటిసి స్థానం నుంచి ఎన్నికల బరిలో నిలిచేందుకు సన్నద్ధమవుతున్నారు. యువ నాయకుడిగా గుర్తింపు పొందిన ఆయన ప్రస్తుతం ఎన్నికల నేపథ్యంలో తన ప్రయత్నాలను ముమ్మరం చేశారు. ఎస్టి సామాజిక వర్గానికి చెందిన రమేష్ సామాజిక అంశాలపై అవగాహన కలిగిన నాయకుడిగా మండల, జిల్లా రాజకీయాల్లో చురుకుగా వ్యవహరిస్తున్నారు. స్థానిక సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం దిశగా కృషి చేస్తూ ప్రజలతో మమేకమవుతున్నారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు సామాన్య ప్రజల సమస్యలపై స్పందిస్తూ ప్రత్యేక గుర్తింపును సంపాదించుకున్నారు. జాతీయ మానవ హక్కుల కమిటీ జిల్లా చైర్మన్‌గా పనిచేసిన అనుభవంతో పాలనలోని లోపాలపై ఆయనకు లోతైన అవగాహన ఏర్పడిందని ఆయన అనుచరులు చెబుతున్నారు. పేదల జీవన స్థితిగతులు, సామాజిక సమస్యలను దగ్గరగా పరిశీలించిన ఆయన ప్రజా ప్రతినిధిగా మారి నేరుగా సేవ చేయాలనే లక్ష్యంతో రాజకీయ రంగ ప్రవేశం చేస్తున్నట్లు సమాచారం. ఎన్నికల సమయం దగ్గరపడుతున్న నేపథ్యంలో ఆయన వేస్తున్న అడుగులు మండల రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి. ఏ రాజకీయ పార్టీ మద్దతు ఉన్నా లేకపోయినా, స్వతంత్ర అభ్యర్థిగానైనా పోటీ చేసి ప్రజాసేవ చేయాలనే కృతనిశ్చయంతో ఉన్నట్లు తెలుస్తోంది. యువత, సామాన్య కుటుంబాలతో ఉన్న సాన్నిహిత్యం ఆయనకు బలంగా మారనుందని స్థానిక వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. కొత్త నాయకత్వం కోసం ఎదురుచూస్తున్న ప్రజలు రాథోడ్ రమేష్ వైపు ఆసక్తిగా చూస్తుండటం గమనార్హం. మండల రాజకీయాల్లో కొత్త సమీకరణాలకు ఆయన పోటీ కారణమవుతుందనే చర్చలు వినిపిస్తున్నాయి.

# కాగజ్‌నగర్ రాజకీయాల్లో కీలక మార్పు

**-కాంగ్రెస్‌లోకి యూసఫ్ ఖాన్ -సిద్దం శ్రీనివాస్**



**కాగజ్ నగర్ రూరల్: ఫిబ్రవరి 22(ప్రజా జ్యోతి) :** కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో రాజకీయ పరిణామాలు చర్చనీయాంశంగా మారాయి. స్వతంత్ర అభ్యర్థులుగా గెలుపొందిన 27వ వార్డు కౌన్సిలర్ సిద్దాం రాజేశ్వరి (శ్రీనివాస్) మరియు 9వ వార్డు కౌన్సిలర్ తస్కిన్ మస్తాన్ బెగ్ (యూసఫ్ ఖాన్‌లు) కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఇద్దరూ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్ ను మర్యాదపూర్వకంగా కలిసి ఇకముందు కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగుతామని ప్రకటించారు. పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పట్టణ అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాగజ్‌నగర్ మున్సిపాలిటీ మాజీ చైర్మన్ దస్తగిరి, ప్రస్తుత చైర్మన్ దస్తగిరి, 25వ వార్డు కౌన్సిలర్ దుర్గం సూరజ్ తదితరులు పాల్గొన్నారు. ఇద్దరు కౌన్సిలర్ల చేరికతో మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీ బలం మరింత పెరుగుతుందని నాయకులు పేర్కొన్నారు. పట్టణ ప్రజల సమస్యల పరిష్కారానికి సమన్వయంతో ముందుకు సాగుతామని వారు స్పష్టం చేశారు.




# అఖిలభారత వయోవృద్ధుల సంక్షేమ సమాఖ్య జాతీయ సదన్ లో మంచిర్యాల ప్రతినిధులు

**మంచిర్యాల, 22, ఫిబ్రవరి ( ప్రజా జ్యోతి ):** ఒడిశా రాజధాని భువనేశ్వర్‌లో ఆదివారం ప్రారంభమైన అఖిల భారత సీనియర్ సిటిజన్స్ సదన్‌లో మంచిర్యాల జిల్లా ప్రతినిధులు సందడి చేశారు. మంచిర్యాల జిల్లా గోదావరి రోడ్డులో గల డే కేర్ సెంటర్ వయోవృద్ధుల సంక్షేమ సమాఖ్య అసోసియేషన్ మంచిర్యాల సీనియర్ సిటిజన్ ప్రతినిధులు సైండ్ల మొండయ్య ,అధ్యక్షులు, కే ఎం ఎస్ రెడ్డీ ప్రధాన కార్యదర్శి రిక్కుల రాజా రెడ్డి ఉపాధ్యక్షులు, గోపి సత్యనారాయణ జన్నారం మండల అధ్యక్షులు, కోయల్కర్ నారాయణ మాజీ కోశాధికారి, శ్రీనివాస రెడ్డి, తదితరులు ఈ సదన్ కు హాజరయ్యారు. సమాజానికి సేవలందించిన వృద్ధులను ప్రభుత్వం గౌరవించి, వారికి అవసరమైన రకాల వసతులు కల్పించాలని ఈ సందర్భంగా ఈ ప్రతినిధులు కోరారు. నేడు ( 23న) కూడా ఈ సదన్ కొనసాగుతుంది.

# మంచిర్యాలలో ఉద్యోగ అవకాశాలు

**24న మోడల్ కెరీర్ సెంటర్‌లో జాబ్ మేళా**

**మంచిర్యాల, 22, ఫిబ్రవరి ( ప్రజా జ్యోతి):** మంచిర్యాల జిల్లా నిరుద్యోగ యువతకు శుభవార్త. జిల్లా ఉపాధి కల్పనాధికారి ఆధ్వర్యంలో ఈ నెల 24 న (మంగళవారం) ఉదయం 10.30 గంటలకు మంచిర్యాల పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐ క్యాంపస్‌లోని మోడల్ కెరీర్ సెంటర్‌లో జాబ్ మేళాను నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ జాబ్ మేళాలో మంచిర్యాల పట్టణానికి చెందిన డా. శృతి గోలీస్ బర్త్ రూట్స్ హాస్పిటల్ సంస్థ పాల్గొని వివిధ విభాగాల్లో ఉద్యోగ నియామకాలు చేపట్టనుంది. రిసెప్షనిస్ట్ అండ్ డేటా ఎంట్రీ ఆపరేటర్, స్టాఫ్ నర్సింగ్ ఇన్‌చార్జ్, హౌస్ కీపింగ్ (స్వావెంజ్), ఫార్మాసిస్ట్, సిస్టమ్ ఆపరేటర్ పోస్టులకు మొత్తం 17 ఖాళీలు భర్తీ చేయనున్నట్లు అధికారులు వెల్లడించారు. అర్హతలు పోస్టులనుబట్టి డిగ్రీ, టైపింగ్ నైపుణ్యం, నర్సింగ్ అర్హతలు (బి ఎస్ సి /ఏ ఎన్ ఎం /జి ఎన్ ఎం ), డిప్లొమా ఫార్మసీ, ఎస్ఎస్‌సీ తదితర అర్హతలు కలిగి ఉండాలని, వయోపరిమితి 18 నుంచి 28 సంవత్సరాల లోపు ఉండాలని సూచించారు. పురుషులు, మహిళలు ఇద్దరికీ అవకాశం కల్పించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ విద్యార్హత సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు, బయోడేటాతో జాబ్ మేళాకు హాజరుకావాలని సూచించారు. వివరాలకు 9959607008, 8333059029, 9110368501 నంబర్లను సంప్రదించాలని జిల్లా ఉపాధి కల్పనాధికారి తెలిపారు.



# ఆసిఫాబాద్ 15వ వార్డు: అబ్దుల్లా బాయ్ ఇంటింటి సందర్శనలో ఘన సన్మానం

**ఆసిఫాబాద్ టౌన్ ఫిబ్రవరి 22 ప్రజా జ్యోతి :** ఆసిఫాబాద్ 15వ వార్డు లో కాంగ్రెస్ అభ్యర్థి అబ్దుల్లా బాయ్ భారీ మెజారిటీతో విజయం సాధించిన సందర్భంగా, ఆయన తన వార్డులో ఇంటింటి సందర్శన నిర్వహించి, తమకు మద్దతు అందించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్శనలో కాలనీవాసులు పూలమాలలు, శాలువులతో ఘనంగా సన్మానించి ఆయనను ఆహ్వానించారు. కార్యక్రమంలో ప్రముఖులు ఇస్లాం బిన్ హాసన్, అబ్దుల్ రవూఫ్, తన్వీర్ అహ్మద్, భీంరావు, సతీష్, భరత్ కుమార్, మహమ్మద్ షఫీ, కలీం, అర్షద్, అమర్యాస్తై తదితరులు, అలాగే వార్డు సభ్యులు పాల్గొన్నారు. వార్డు ప్రజల విశ్వాసానికి కృతజ్ఞతలు తెలిపిన అబ్దుల్లా బాయ్, భవిష్యత్తులో అభివృద్ధి కార్యక్రమాలను ప్రాధాన్యతనిచ్చి అమలు చేస్తానని హామీ ఇచ్చారు. వార్డు లో ప్రజల ప్రేమ, మద్దతు మరియు ఉత్సాహం ఈ సందర్శనలో స్పష్టంగా కనిపించింది.

# బ్రోకర్‌గా వ్యవహరించి రూ.17 లక్షలు మోసం

**నిందితుడికి 14 రోజుల రిమాండ్**



**కాగజ్‌నగర్ రూరల్: ఫిబ్రవరి 22 (ప్రజా జ్యోతి):** భూమి విక్రయం పేరుతో 17 లక్షల రూపాయలను తీసుకుని మోసం చేసిన నిందితుడిని అరెస్టు చేసి 14 రోజుల రిమాండ్‌కు తరలించినట్లు కాగజ్‌నగర్ రూరల్ సబ్ ఇన్స్పెక్టర్ సందీప్ కుమార్ తెలిపారు. వివరాల ప్రకారం కాగజ్‌నగర్‌కు చెందిన కృష్ణ అనే వ్యక్తిని రామటెంకి ప్రకాష్ తండ్రి దుర్గయ్య, నివాసం బోధన్‌పల్లి గ్రామం, కౌటాల మండలం మాలిని గ్రామ పరిధిలో ఐదు ఎకరాల పట్టా భూమి తనకు ఉందని నమ్మించాడు. వాస్తవానికి భౌతికంగా లేని భూమిని ఉన్నట్టుగా చూపించి విక్రయిస్తానని చెప్పి 17 లక్షలు తీసుకున్నాడు. తరువాత భూమిని చూపించమని ఫిర్యాదు దారు అడగగా భూమి లేనట్లు బయటపడింది. అదేవిధంగా ఫిర్యాదు దారుని బెదిరించినట్లు విచారణలో వెల్లడైంది. ఈ మేరకు కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేసి, న్యాయస్థానం ఆదేశాల మేరకు 14 రోజుల రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ సందీప్ పేర్కొన్నారు.

# సమయానికి రక్తదానం: ప్రాణాన్ని కాపాడిన ప్రజాసేవ వెల్ఫేర్ సొసైటీ సభ్యుడు.

**మందమర్రి, ఫిబ్రవరి 22(ప్రజాజ్యోతి )మంచిర్యాల:** ఆపదలో ఉన్న వారికి అండగా నిలుస్తూ ప్రజాసేవ వెల్ఫేర్ సొసైటీ సభ్యుడు దుర్గం రాము మానవత్వాన్ని చాటుకున్నారు. కట్ట రామలక్ష్మి అనే మహిళకు అత్యవసరంగా రక్తం అవసరం కావడంతో, వెంటనే స్పందించిన రాము మంచిర్యాల బ్లడ్ బ్యాంక్‌లో రక్తదానం చేశారు. ఈ సందర్భంగా సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు షేక్ అజీమోద్దీన్ మాట్లాడుతూ.. అత్యవసర స్థితిలో ఉన్న వారికి సహాయం చేయడానికి తమ సొసైటీ డోనర్స్ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటారని తెలిపారు. రక్తదానం మహాదానం అని, ప్రాణాపాయంలో ఉన్నవారిని ఆదుకోవడం అందరి బాధ్యతని ఆయన పేర్కొన్నారు. సమయానికి స్పందించిన రామును పలువురు అభినందించారు.

# ప్రతి గ్రామ పంచాయతీలో సమాచార బోర్డులు తప్పనిసరి

**ఆర్టీఐ చట్టం అమలులో నిర్లక్ష్యం చేస్తే ఉపేక్షించం: వంగరి ప్రవీణ్**



**కాగజ్ నగర్ రూరల్: ఫిబ్రవరి 22 (ప్రజా జ్యోతి):** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని ప్రతి గ్రామ పంచాయతీ కార్యాలయంలో సమాచార హక్కు చట్టం2005 ప్రకారం అవసరమైన వివరాలతో సమాచార బోర్డులు ఏర్పాటు చేయాలని సమాచార హక్కు రక్షణ చట్టం కొమురం భీం జిల్లా ప్రధాన కార్యదర్శి వంగరి ప్రవీణ్ డిమాండ్ చేశారు. ప్రజలకు అవసరమైన సమాచారాన్ని సులభంగా పొందేలా పబ్లిక్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ (గ్రా), అప్పీలేట్ అథారిటీ పేర్లు, హోదాలు, సంప్రదింపు నంబర్లు స్పష్టంగా బోర్డులపై ప్రదర్శించాలని సూచించారు. ప్రతి అధికారి బాధ్యతలు, విధులు, కార్యాలయ సమయాలు, ప్రభుత్వం ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ నంబర్లు ప్రజలకు అందుబాటులో ఉంచాలని తెలిపారు. గ్రామ పంచాయతీ అధికారులు, ప్రజా ఆరోగ్య సేవా కేంద్ర సిబ్బంది సమయానికి విధులకు హాజరై పారదర్శకంగా పనిచేయాలని హెచ్చరించారు. సమాచార హక్కు చట్టం ద్వారా ప్రతి పౌరుడికి ప్రభుత్వ కార్యాచరణపై ప్రశ్నించే హక్కు ఉందని, అభివృద్ధి పనులు, నిధుల వినియోగం, సంక్షేమ పథకాల అమలు వివరాలు తెలుసుకోవడం ప్రజల రాజ్యాంగబద్ధ హక్కు అని పేర్కొన్నారు. గ్రామ స్థాయిలో ఆర్టీఐపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రజల్లో చైతన్యం పెంపొందించేందుకు తమ సొసైటీ కృషి చేస్తుందని తెలిపారు. జిల్లాలోని గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో చట్టంపై అవగాహన కల్పించేందుకు అవసరమైన సమాచార బోర్డుల ఏర్పాటును తమ సొసైటీ పర్యవేక్షిస్తుందని వెల్లడించారు. చట్టాన్ని అమలులో నిర్లక్ష్యం చేసి ప్రజలకు సమాచారాన్ని అందుబాటులో ఉంచని అధికారులపై సంబంధిత ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేసి తగు చర్యలు తీసుకునేలా చర్యలు చేపడతామని హెచ్చరించారు. ప్రజా చట్టాలను దిక్కరించే వారిని ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సమాచార హక్కు రక్షణ చట్టం2005 సొసైటీ సిర్పూర్ నియోజకవర్గ అధ్యక్షులు మాదాస్ నాగేష్, కాగజ్‌నగర్ మండల అధ్యక్షులు కడారి శ్రీనివాస్, కార్యదర్శి సముద్రాల దామోదర్, కోశాధికారి మద్దెల సురేష్, మండల ఉపాధ్యక్షులు సంతోష్, జాయింట్ సెక్రటరీ దుర్గం సంతోష్, ప్రచార కార్యదర్శి ఆకాష్ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం



**రెబ్బెన ఫిబ్రవరి 22 ప్రజా జ్యోతి న్యూస్ :** గద్దెన మండలంలో రోడ్డు భద్రతపై అవగాహన కల్పించే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమాన్ని తెలంగాణ పోలీస్ ఆధ్వర్యంలో స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్వహించారు ముఖ్యఅతిథిగా ఎస్ఐ గారు పాల్గొని వానదారులకు ట్రాఫిక్ నియమాల ప్రాముఖ్యత వివరించారు ఎస్సై మాట్లాడుతూ హెల్మెట్ లేకుండా బైక్ నడపడం మద్యం సేవించి వాహనం నడపడం ప్రమాదాలకు ప్రధాన కారణాలు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి తమ ప్రాంతాలతో పాటు ఇతరుల ప్రాణాలను కాపాడాలని సూచించారు ఈ సందర్భంగా విద్యార్థులకు మరియు యువతకు ప్రత్యేకంగా అవగాహన కల్పించారు రోడ్డు దాటేటప్పుడు జీబ్రా క్రాసింగ్ వినియోగించాలి పవర్ స్పీడు చేయకూడదు మొబైల్ ఫోన్ ఉపయోగించకూడదని సూచనలు ఇచ్చారు అలాగే హెల్మెట్ వినియోగంపై ప్రాముఖ్యత వివరించారు

# ఉచిత సంతాన సాఫల్య వైద్య శిబిరానికి భారీ స్పందన



**నేరడిగొండ ఫిబ్రవరి 22(ప్రజాజ్యోతి ):** నేరడిగొండ మండలంలోని వడూర్ గ్రామంలో సర్పంచ్ ఆడెపు. శ్రీకాంత్,ఉప సర్పంచ్ , ఏరడ్ల. మమత, వార్డు సభ్యుల ఆధ్వర్యంలో గ్రామపంచాయతీలో నిర్వహించిన నిర్మల్ లోని ప్రముఖ వెంకటేశ్వర హాస్పిటల్ డాక్టర్స్ సంతానము లేని సమస్యతో బాధపడుతున్న వారికి డాక్టర్ మమత స్త్రీ వైద్య నిపుణులు 25 మంది పేషెంట్స్ ని పరీక్షించి సరియైన సలహాలను పాటించాలని , సంతానము లేని సమస్యలతో బాధపడుతున్న వారికి సలహాలు సూచనలు ఇచ్చారు. డాక్టర్ మమతా వంశీ మాట్లాడుతూ, ఆడవాళ్ళలో సంతానం లేని సమస్యతో బాధపడుతు (పిసిఓడి) గర్భాశయ గడ్డలు ఇతరత్రా సమస్యలు ఉన్నచో మగవాళ్లలో వీర్యకణాల తో బాధపడుతున్న వారు తమ ఆస్పిటల్ లో (ఐయూఎఫ్) (ఐవిఎఫ్ )తక్కువ ఖర్చులోనే ట్రీట్మెంట్ ఇస్తామని తెలియజేశారు. ఇట్టి శిబిరంలో చూపించుకున్న పేషెంట్స్ కి ఉచితంగా మందులను అందజేశారు. ఇట్టి ఉచిత వైద్య శిబిరానికి భారీ స్పందన వచ్చింది. అనంతరం గ్రామ సర్పంచ్ ఆడెపు శ్రీకాంత్, గ్రామ పంచాయతీ సిబ్బందితో కలిసి డాక్టర్ మమతా వంశీని శాలువాతో సన్మానించారు. ఇందులో గ్రామ సర్పంచ్ ఆడెపు. శ్రీకాంత్, ఉపసర్పంచ్ ఏరడ్ల. మమతా, వడూర్ స్థానిక ఆర్ఎంపీ డాక్టర్ రాములు, వార్డు సభ్యులు చంద్రశేఖర్, ఉష్నన్న,లక్ష్మణ్, దేవి సింగ్, గ్రామస్తులు మహేందర్, గ్రామ ప్రజలు తదితరులు ఉన్నారు.

# మెజారిటీ సర్పంచుల ఫోరమ్ మాదే..

**శిక్షణా తరగతులకు తప్పనిసరిగా హాజరు కావాలి.**



**జన్నారం,ఫిబ్రవరి22(ప్రజాజ్యోతి):** జన్నారం మండలంలోని మెజారిటీ సర్పంచులున్న ఫోరం తమదేనని జన్నారం మండలం సర్పంచుల ఫోరం అధ్యక్షులు కుదురె వెంకన్న తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జన్నారం మండలంలో ఉన్న 29 గ్రామపంచాయతీలకు గాను 21 మంది సర్పంచులు తమ ఫోరంలో ఉన్నారని అన్నారు. ఒక పార్టీకి సంబంధించిన సర్పంచ్ కేవలం ఎనిమిది మందిని పెట్టుకొని ఒక సర్పంచ్ ఫోరం ను ఏర్పాటు చేసుకుని పత్రికా ప్రకటనలు ఇవ్వడం సరికాదన్నారు. నేటి నుండి మంచిర్యాల జిల్లా కేంద్రంలో సర్పంచు లకు నిర్వహించే శిక్షణా తరగతులకు మండల సర్పంచు లు తప్పక హాజరై సద్వినియం చేసుకోవాలని కోరారు.

# రైతు బంధు నిధులను వెంటనే విడుదల చేయాలి

**-బి ఆర్ ఎస్ పట్టణ అధ్యక్షుడు అల్లకొండ ప్రశాంత్**



**బోథ్, ఫిబ్రవరి 22 (ప్రజా జ్యోతి):** రైతులకు రావాల్సిన రైతు బంధు నిధులను కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే వారి ఖాతాల్లో జమ చేయాలి అని బి ఆర్ ఎస్ పట్టణ అధ్యక్షుడు అల్లకొండ ప్రశాంత్ ఆదివారం డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలోకి రాగానే రైతులకు కౌలు రైతులకు రైతు భరోసా కింద ఏడాదికి 15 వేల రూపాయలు ఇస్తామని చెప్పిన హామీ ఇప్పటికీ నెరవేరలేదు అని ఎద్దేవా చేశారు.ఎన్నికల ప్రచారంలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మున్సిపల్ ఎన్నికలు ముగియగానే నిధులు వేస్తామని మాట ఇచ్చారని, కానీ క్షేత్రస్థాయిలో రైతులు ఇంకా ఎదురుచూస్తూనే ఉన్నారు అని కేవలం రైతు బంధు మాత్రమే కాకుండా, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన ఆరు గ్యారంటీల అమలులో వైఫల్యం చెందింది అని తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలైన చేయూత పథకం కింద నాలుగు వేలు రూపాయల పెన్షన్, మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు నెలకు 2500 రూపాయల, యువ వికాసం కింద 5 లక్షల విద్యా భరోసా కార్డులు ప్రతి మండలంలో ఇంటర్నేషనల్ స్కూళ్ల ఏర్పాటు ఎప్పుడు చేస్తారు అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను విస్మరిస్తే ఊరుకునేది లేదని ముఖ్యంగా రైతుల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తే బీఆర్ఎస్ పార్టీ పక్షాన ప్రత్యక్ష పోరాటానికి దిగడానికి ఎప్పుడు ముందుంటుందని పేర్కొన్నారు. తక్షణమే స్పందించి రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయాలని, లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని తెలిపారు.

# తప్పుడు ప్రచారాలతో ప్రజల్లో అపోహలు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవు

**నిర్మల్ జిల్లా ఏఎస్పీ సాయికిరణ్ వెల్లడి**



**ఖానాపూర్ ఫిబ్రవరి 22 (ప్రజా జ్యోతి):** జిల్లాలో సోషల్ మీడియా తో వివిధ రకాలుగా తప్పుడు అసత్య ప్రచారాలు చేసి ప్రజల్లో అపోహలు కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని నిర్మల్ జిల్లా ఏఎస్పి సాయికిరణ్ ప్రకటనలో హెచ్చరించారు ఇటీవల జిల్లాలో ఒక ప్రమాదానికి చెందిన సంఘటనను దృష్టిలో పెట్టుకొని ఇరువర్గాల్లో ఘర్షణ జరిగి పరస్పర వ్యక్తులపై కేసులు నమోదైనట్లు సృష్టించి ప్రచారం చేస్తున్న విషయం పోలీసుల దృష్టికి వచ్చిందని అన్నారు ఇదే కాకుండా వ్యక్తిగత దూషణలు ఆరోపణలు రుజువులేని వాటిని నిరాధారంగా సోషల్ మీడియాలో ప్రచారం చేయడం చట్టరీత్య నేరమన్నారు ఈ మేరకు జిల్లా ఎస్పీ డాక్టర్ జి జానకి షర్మిల ఆదేశాలతో పాటు జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలోని పట్టణాల్లో గ్రామాల్లో సైతం ఇలాంటి సోషల్ మీడియా పోస్టింగులు ప్రచారాలపై గట్టి నిఘా వేసి చర్యలు తీసుకోనున్నట్లు ఎ ఎస్పి సాయికిరణ్ తెలిపారు

# చెట్ల కిందే హెచ్ పీ గ్యాస్ పంపిణీ వినియోగదారులకు తప్పని తిప్పలు

**ఖానాపూర్, ఫిబ్రవరి 22 (ప్రజా జ్యోతి ) :** సరైన పక్కా అడ్రస్ లేక చీటికిమాటికి అడ్డాలు మారుస్తూ చెట్ల కింద హెచ్.పీ గ్యాస్ పంపిణీతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వినియోగదారులు ఆరోపిస్తున్నారు నిర్మల్ జిల్లా ఖానాపూర్ పట్టణం, చుట్టు పక్కల గ్రామాల హెచ్పీ వంట గ్యాస్ వినియోగదారులు సిలెండర్ బుడ్డి కోసం నానా తంటాలు పడుతున్నారు. ఖానాపూర్ లో హెచ్ పీ గ్యాస్ కంపెనీకి చెందిన ఆఫీస్, డీలర్ గత 30 ఏళ్లుగా లేదు పక్క ఆఫీస్ లేదు వారంకు రెండుసార్లు నిర్మల్ జిల్లా కేంద్రంలోని హెచ్ పీ గ్యాస్ కంపెనీ నుంచి ఒక వ్యాన్ లో సిలెండర్ బుడ్డి లు తెచ్చి ఇస్తున్నారు. వారం లో ఒకటి లేదా రెండు సార్లు వస్తారు. వారికి ఇక్కడ గ్యాస్ డెలివరీ చేసెందుకు కనీసం ఒక ప్రత్యేక రూమ్ కాని, ఆఫీస్ కాని లేదు. పట్టణం శివారులో మార్కెట్ యార్డ్ దగ్గరలో ఒక చెట్టు కింద వాహనాన్ని నిలిపి డెలివరీ ఇస్తున్నారు. సిలెండర్ కోసం వచ్చిన వాళ్ళు ఎండలో నిలబడి వాహనం వచ్చే వరకు ఎదురు చూస్తూ.. ఇబ్బంది పడుతున్నారు. అయితే ముందుగా ఫోన్ ద్వారా బుక్ చేసుకోవాలి. ఇలా బుక్ చేసుకున్న వారికి ఖాళీ సిలెండర్ తీసుకొని డెలివరీ చేసే చోటుకు వెళితే, మీరు బుక్ చేసుకున్న సిలెండర్ రాలేదని వెనక్కి పంపిస్తున్నారు. దీనితో ఎంతో దూరం నుండి వచ్చిన వినియోగదారులు బాధతో ఇంటికి వెళ్లిపోతున్నారు. వారికి అదనంగా ఆటో ఛార్జ్లు, సమయం వృధా అవుతుందని వాపోతున్నారు. ఖానాపూర్ లోనే ఆఫీస్ ఉంటే ఈ సమస్య ఉండేది కాదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ కేంద్రం అయినప్పటికీ హెచ్ పీ గ్యాస్ కంపెనీ లేకపోవడంతో పర్మనెంట్ సర్వీస్ సెంటర్ ఏర్పాటు చేయకపోవడం పట్ల వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఖానాపూర్లో హెచ్పీ గ్యాస్ డీలర్ను నియమించాలని, చేయాలని వినియోగదారులు కోరుతున్నారు.

## ఉమ్మడి తెలుగు రాష్ట్రాల డిసిసి అధ్యక్షుల సమావేశంలో కష్టపడి పని చేస్తే ధనిక పేద కుల ప్రస్తావన లేకుండా పదవులు వస్తాయని

**ఖానాపూర్ ఎం ఎల్ ఎ బొజ్జు పటేల్ ను ప్రస్తావించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**



**ఖానాపూర్ ఫిబ్రవరి 22( ప్రజా జ్యోతి ) :** ఉమ్మడి తెలుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్,తెలంగాణ లోని సుమారు 50 మంది జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుముఖ్య సమావేశంలో ఖానాపూర్ శాసనసభ్యులు ఆదివాసి పోరు బిడ్డ వెడమ బొజ్జు పటేల్ పేరును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హర్షధ్వానాల మధ్య ప్రస్తావించారు కాంగ్రెస్ పార్టీలో కష్టపడి పనిచేసిన వారికి ఫలితాలు తప్పకుండా కలుగుతాయని ఇందుకు ఉదాహరణ తెలంగాణ రాష్ట్రంలో సుమారు 20 మందికి వివిధ రకాల కార్పొరేషన్ల చైర్మన్లుగా సుదీర్ఘ కాలంగా గుర్తించి సామాజిక పరంగా కేటాయించామని ఉదాహరించారు

**టికెట్ ఇచ్చాం ఎమ్మెల్యేతో పాటు జిల్లా అధ్యక్షులుఅయిపోయాడు**

తెలంగాణ రాష్ట్రంలోని వికారాబాద్ జిల్లాలో ఉమ్మడి రాష్ట్రాల కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులకు పది రోజులపాటు శిక్షణ తరగతుల కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా మాట్లాడిన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గిరిజన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఉట్నూర్ ప్రాంతంలోని ఒక గోండు గూడాలో ఇందిరమ్మ ఇంటిలో తన తల్లిదండ్రులతో నివాసముంటున్న వెడమ బొజ్జుపటేల్ను ఇంద్రవెల్లి మండలంలోని కేస్లాపూర్ నాగోబా దేవాలయంలో తాను పిసిసి అధ్యక్షులుగా ఉన్నప్పుడు అక్కడ చురుగ్గా పనిచేస్తున్న బొజ్జును చూసి తను ఎవరు తన పేరు ఏంటి అని తెలుసుకొని టికెట్ ఇస్తే కూలినాలి పని తన తల్లిదండ్రులు చేసుకుంటూ ఇందిరమ్మ ఇంట్లో నివాసం ఉంటున్న వెడమ బొజ్జు పటేల్ నేడుతెలంగాణ లోని నిర్మల్ జిల్లా ఖానాపూర్ గిరిజన నియోజకవర్గానికి ఎమ్మెల్యే అయ్యారని ప్రస్తావించారు ఇంతటితో ఆగకుండా గడిచిన జిల్లాల నూతన అధ్యక్షుల జాబితాలో నిర్మల్ జిల్లాకు అధ్యక్షుడిగా కూడా పార్టీ బొజ్జు సేవలను గుర్తించి నియమించిందని గుర్తు చేశారు ఈ సందర్భంగా బొజ్జు పటేల్ సభలో వినయ పూర్వకంగా కింద కూర్చున్న చోటు నుంచి పైకి లేచి రెండు చేతులు జోడించి సభ్యులకు నమస్కరించి పరిచయం చేసుకున్నారు రానున్న రోజుల్లో తెలంగాణలో మరోసారి ప్రభుత్వం ఏర్పాటు చేస్తు ఆంధ్రప్రదేశ్లోనూ పార్టీ పటిష్ట పరిచి అధికారంలోకి రావాలని ఆకాంక్షించారు కాంగ్రెస్ పార్టీలో కులం మతాల పైరవీలు లేవని కేవలం పనితనమే మెరుగ్గా ఉంటే సంవత్సరం కోసారి రాశే పరీక్షల్లో స్టూడెంట్ లకు మెరిట్లా వాటంత అవే ఎలాంటి పదవులు అయినా వరిస్తాయని అన్నారు పటిష్టమైన సోనియాగాంధీ ఆశీస్సులతో రాహుల్ గాంధీ ప్రియాంక గాంధీ మల్లికార్జున్ కార్గెల నాయకత్వంలో పార్టీ నడుస్తుందని క్రమశిక్షణతో మెలిగి ప్రజాప్రతినిధులతో పాటు ప్రజలకు చేరువై అభివృద్ధి చేయిస్తూ పార్టీ అభివృద్ధికి కృషి చేయాల్సిన అవసరాన్ని ప్రతి ఒక్క జిల్లా అధ్యక్షులు గుర్తుతెరగాలని ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి సూచించారు

# పోచమ్మ తల్లి ఆశీస్సులతో ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలి



**బోథ్, ఫిబ్రవరి 22 (ప్రజా జ్యోతి):** బోథ్ మండలంలోని కౌట బి గ్రామంలో పోచమ్మ ఆలయ విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమానికి గ్రామస్తుల పిలుపు మేరకు ముఖ్య అతిథిగా హాజరై దర్శనం చేసుకున్న రాష్ట్ర అధ్యాపకుల సంఘం ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్. అనంతరం బలరాం మాట్లాడుతూ గ్రామానికి ఆరోగ్య పరంగా, పంటల దిగుబడి పరంగా, చెడు శక్తుల నివారణ పరంగా గ్రామానికి రక్షణ గా పోచమ్మ తల్లి ఉంటుందని అలాంటి గ్రామదేవత విగ్రహ ప్రతిష్టాపన చేసుకుంటున్న గ్రామప్రజలకు శుభాకాంక్షలు తెలియజేసారు. తల్లి అనుగ్రహం గ్రామప్రజల పై ఎల్లప్పుడు ఉండాలని కోరుకున్నారు.



**సంఘటన్ సృజన్ అభియాన్ కార్యక్రమం భాగంగారెండవ రోజు తెలంగాణ, ఏపీ డిసిసి అధ్యక్షుల శిబిరంలో నిర్మల్ జిల్లా డిసిసి అధ్యక్షులు ఎం ఎల్ ఎ బొజ్జు పటేల్**

**ఖానాపూర్ ఫిబ్రవరి 22(ప్రజా జ్యోతి ) :** వికారాబాద్ లోని అనంతగిరిలో తెలంగాణ, ఏపీ డిసిసి అధ్యక్షులకు పది రోజుల శిక్షణ శిబిరం కేంద్ర కాంగ్రెస్ పార్టీ ఆదేశాల మేరకు ప్రారంభం అయింది మొదటిరోజు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి టీపీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో ప్రారంభమై ఆదివారం కు రెండవ రోజు అయినది కార్యక్రమంలో పాల్గొన్న నిర్మల్ జిల్లా డిసిసి అధ్యక్షులు ఖానాపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు వెడ్మ బొజ్జు పటేల్, సంఘటన్ సృజన్ ప్రోగ్రాం చైర్మన్ ఆధ్వర్యంలో సెక్రటరీ వంశీచంద్ర రెడ్డి, చైర్మన్ ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి నేతృత్వంలో ఈ శిక్షణ శిబిరంలో,నిర్వహించబడుతుందని తెలిపారు పది రోజుల పాటు జరిగే ఈ శిబిరం లో నాయకత్వ, నైపుణ్యాలు, ప్రజా సమస్యల పరిష్కార విధానాలు, ఎన్నికల వ్యూహాలు, తదితర అంశాలపై చర్చించడం జరుగుతుంది అని అన్నారు కరీంనగర్ జిల్లాకు చెందిన తెలంగాణ రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ రాష్ట్ర టి పి సిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ వివిధ జిల్లాల డిసిసి అధ్యక్షులు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఆదిలాబాద్ అధ్యక్షులు నరేష్జాదవ్ ఆసిఫాబాద్ అధ్యక్షులు ఆత్రం సుగుణ నిర్మల్ జిల్లా అధ్యక్షులు ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు పటేల్తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన బోథ్ ఎమ్మెల్యే

**నేరడిగొండ ఫిబ్రవరి 22(ప్రజాజ్యోతి ):** నేరడిగొండ మండలంలోని వెంకటాపూర్ సర్పంచ్ వెంకట్రాం సోదరులు ప్రేమ్సింగ్ (సెక్షన్ ఆఫీసర్) కుమార్తె వివాహం ఆదిలాబాద్ పట్టణంలోని పద్మనాయక కళ్యాణ మండపంలో ఘనంగా జరిగింది. ఇట్టి వివాహ వేడుకకు బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ హాజరయి నూతన వధూవరులను ఆశీర్వదించారు. వీరి వెంట మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, తిరుమల గౌడ్, జహీర్, సర్పంచులు భీంరావ్, ప్రతాప్, నాయకులు రాథోడ్ సురేందర్, నిఖిల్ నేరడిగొండ బి ఆర్ ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

